
సాక్షి
బాపట్ల
ఆదివారం । 29 । అక్టోబర్ । 2023




కోటప్పకొండ ఆలయం మూసివేత

నరసరావుపేటరూరల్: చంద్ర గ్రహణాన్ని పురస్కరించుకుని త్రికోటేశ్వరస్వామి ఆలయాన్ని శనివారం మూసివేశారు. కార్యక్రమంలో నాగిరెడ్డి, అర్చకులు పాల్గొన్నారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం శనివారం 525.10 అడుగుల వద్ద ఉంది. ఎస్ఎల్‌బీసీకి 1,350 క్యూసెక్కులు విడుదలవుతోంది.



సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్: కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద ఆదివారం 4808 క్యూసెక్కులు విడుదల చేశారు. హై లెవల్ కాలువకు 246 క్యూసెక్కులు విడుదల చేశారు.



జన కెరటం....బాపట్ల పట్టణంలోని అంబేడ్కర్ సెంటర్‌లో జరిగిన బహిరంగసభకు హాజరైన జన సందోహం

సామాజిక సమరోత్సాహం

- యాత్రకు జైకొట్టిన భావపురి
- గ్రామాల నుంచి తరలివచ్చిన అభిమానులు
- భారీ ద్విచక్రవాహన ర్యాలీలు
- నేతలకు ఘనస్వాగతం
- జగనన్నతోనే అభివృద్ధి అంటూ నినాదాలు

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ చేపట్టిన సామాజిక సాధికార యాత్రకు బాపట్ల నియోజకవర్గ ప్రజలు బ్రహ్మరథం పట్టారు. అభిమాన నేతలకు అడుగడుగునా నీరాజనం పలికారు. గ్రామీణ ప్రాంతాలలో వివిధ సామాజిక వర్గాల ప్రజలు తరలివచ్చి పూల వర్షం కురిపించి తమ మద్దతు తెలిపారు. అధిక సంఖ్యలో తరలివచ్చిన యువత ద్విచక్రవాహన ర్యాలీ నిర్వహించారు. టపాసులు, డప్పుల మోతతో హోరెత్తించారు.



యాత్ర అగ్ర భాగాన విజయసాయిరెడ్డి, మోపిదేవి, ఉమ్మారెడ్డి, కోన, సునీత, బత్తుల



ద్విచక్రవాహన ర్యాలీలో పాల్గొన్న యువత

సాక్షి ప్రతినిధి, బాపట్ల: పిట్టలవానిపాలెం మండలం సంగుపాలెంకోడూరులో మధ్యాహ్నం 12.20 గంటలకు సామాజిక సాధికార యాత్ర ప్రారంభమైంది. పార్టీ నేతలు, కార్యకర్తలు, ప్రజలు యాత్రకు ఘనస్వాగతం పలికారు. అనంతరం మధ్యాహ్నం 1.10 గంటలకు యాత్ర చందోలులోని బండ్లమ్మ అమ్మవారి ఆలయానికి చేరుకుంది. నేతలకు ఆలయం వద్ద పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అమ్మవారి ఆలయంలో నేతలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. 1.55 గంటలకు చందోలులోని పెద్ద మసీదుకు చేరుకుని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం చందోలులోని నీలి బంగారయ్య ఉన్నత పాఠశాలలో జరిగిన నాడు–నేడు పనులను పరిశీలించారు. నాడు–నేడు ద్వారా విద్య, వైద్యం తదితర విభాగాలలో జరిగిన అభివృద్ధి పనులను రాజ్యసభ సభ్యులు విజయసాయిరెడ్డి ప్రజలకు వివరించారు. చందోలు నుంచి ప్రారంభమైన యాత్ర రెడ్డిపాలెం, కర్లపాలెం మీదుగా సాయంత్రం 5.30 గంటలకు బాపట్ల పట్టణానికి చేరుకుంది. భారీగా తరలివచ్చిన యువకులు ద్విచక్రవాహనాలపై ర్యాలీగా యాత్ర వెంటే సాగారు. అనంతరం అంబేడ్కర్ సెంటర్‌లో 5.40 గంటలకు బహిరంగసభ ప్రారంభమైంది. సభలో గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్, రాజ్యసభ సభ్యులు విజయసాయిరెడ్డి, మోపిదేవి వెంకటరమణారావు, ఎంపీ నందిగం సురేష్, ఎమ్మెల్సీలు ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు, పోతుల సునీత, ఎమ్మెల్యేలు కోన రఘుపతి, మహ్మద్ ముస్తఫా, మార్కెటింగ్ శాఖ సలహాదారుడు బత్తుల బ్రహ్మానంద రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేతల ప్రసంగాలకు అపూర్వ స్పందన

చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలు రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా ఎదిగేందుకు విశేష కృషిచేశారని మంత్రి జోగి రమేష్, ఎంపీలు మోపిదేవి, నందిగం సురేష్ అన్నారు. చంద్రబాబు బడుగు, బలహీనవర్గాలను ఏమాత్రం ఎదగనీయకుండా అణచివేశారన్నారు. ఆయా వర్గాల ప్రజలపై కేసులు పెట్టించి వారిని జైళ్ల పాలు చేశారన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి ఆ వర్గాల అభ్యున్నతికి అహర్నిశలు కృషి చేసి అందలం ఎక్కించారన్నారు. దీంతో సభకు హాజరైన ఆయా సామాజిక వర్గాల ప్రజలు హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు. జై జగన్ అంటూ నినాదాలు చేశారు. రాబోయే ఎన్నికల్లోనూ తిరిగి జగన్‌ను ముఖ్యమంత్రిని చేసుకుంటేనే పేద వర్గాలకు మేలు జరుగుతుందని నేతలు ఇచ్చిన పిలుపుకు జనం పెద్దఎత్తున స్పందించారు. కాబోయే ముఖ్యమంత్రి జగన్ అంటూ పెద్దఎత్తున నినదించారు.



బండ్లమ్మ ఆలయంలో హోమం చేస్తున్న నేతలు



చందోలు పెద్ద మసీదులో ప్రార్థనలు



మంత్రి, ఎమ్మెల్యేలను సత్కరిస్తున్న దృశ్యం

విద్య, వైద్యం, వ్యవసాయానికి ప్రభుత్వం పెద్ద పీట

రాజ్యసభ సభ్యులు విజయసాయిరెడ్డి



మాట్లాడుతున్న రాజ్యసభ సభ్యులు విజయసాయిరెడ్డి, వేదికపై మంత్రి జోగి రమేష్, ఎంపీలు మోపిదేవి, నందిగం సురేష్, ఎమ్మెల్సీలు ఉమ్మారెడ్డి, సునీత, ఎమ్మెల్యే కోన రఘుపతి

చందోలు(కర్లపాలెం): ప్రభుత్వం విద్య, వైద్యం, వ్యవసాయ రంగాలకు పెద్ద పీట వేస్తుందని వైఎస్సార్ సీపీ రీజనల్ కో ఆర్డినేటర్, రాజ్యసభ సభ్యులు విజయసాయిరెడ్డి తెలిపారు. బాపట్ల జిల్లా పిట్టలవానిపాలెం మండలం చందోలులోని నీలి బంగారయ్య పాఠశాలలో జరుగుతున్న నాడు–నేడు పనులను సామాజిక సాధికార బస్సు యాత్రలో భాగంగా వచ్చిన విజయసాయిరెడ్డి శనివారం పరిశీలించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు ఘన స్వాగతం పలికారు. విద్యార్థులు సీఎం జగన్‌పై, దివంగత నేత వైఎస్సార్‌పై పాటలు పాడి అలరించారు. విజయసాయిరెడ్డి మాట్లాడుతూ నాడు–నేడు కార్యక్రమాలతో ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పిస్తున్నామని చెప్పారు. మాతృభాషకు ప్రాధాన్యమిస్తూ ఆంగ్ల భాషను కూడా విద్యార్థులకు నేర్పేందుకు ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియం ప్రవేశపెట్టామన్నారు. ఇంగ్లిష్ నేర్చుకున్న విద్యార్థులు భవిష్యత్తులో ఏ రాష్ట్రంలోనైనా ఏదేశంలోనైనా ఉద్యోగాలు, వ్యాపారాలు చేసుకునేందుకు వీలు కలుగుతుందని చెప్పారు. చందోలు నీలి బంగారయ్య పాఠశాలకు రెండు విడతలుగా అభివృద్ధి పనుల కోసం నాడు–నేడు కార్యక్రమంలో సుమారు రూ.కోటి మంజూరయ్యాయని తెలిపారు. విద్యార్థులు కమ్యూనికేషన్ స్కిల్స్ పెంపొందించుకోవాలన్నారు. 2024లో జరిగే ఎన్నికలలో కోన రఘుపతిని ఎమ్మెల్యేగా గెలిపించుకోవాలని ప్రజలకు పిలుపునిచ్చారు. అనంతరం విజయసాయిరెడ్డిని రైస్ మిల్లర్స్ అసోసియేషన్ సభ్యులు, న్యాయవాదులు, పాస్టర్లు విడివిడిగా కలసి తమ సమస్యలను వివరించారు. ఎమ్మెల్యే కోన రఘుపతి, వైఎస్సార్ సీపీ బాపట్ల జిల్లా అధ్యక్షుడు మోపిదేవి వెంకటరమణారావు, రాష్ట్ర మంత్రి జోగి రమేష్, బాపట్ల ఎంపీ నందిగం సురేష్, ఎమ్మెల్సీలు ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు, పోతుల సునీత, ప్రభుత్వ సలహాదారు బత్తుల బ్రహ్మానందరెడ్డి, గుంటూరు తూర్పు ఎమ్మెల్యే షేక్ ముస్తఫా తదితరులు ఉన్నారు.

ఆదికవి మహర్షి వాల్మీకి జయంతి

బాపట్ల అర్బన్: ఆది కవి వాల్మీకి జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తోందని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా తెలిపారు. ఆదికవి మహర్షి వాల్మీకి జయంతి ఉత్సవం జిల్లా బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శనివారం స్థానిక కలెక్టరేట్‌లోని స్పందన సమావేశ మందిరంలో నిర్వహించారు. కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన మహర్షి వాల్మీకి చిత్రపటానికి కలెక్టర్‌తోపాటు పలువురు అధికారులు పుష్పమాలలతో ఘనంగా నివాళులర్పించారు. సంస్కృతంలో పద్యాలు రాసిన తొలి కవి వాల్మీకి అని కలెక్టర్ చెప్పారు. రామాయణాన్ని సంస్కృతంలోనే పద్యాలతో రచించిన తొలి కవిగా గుర్తింపు పొందారని తెలిపారు. రామాయణం తొలి కావ్యంగా ప్రాచుర్యం పొందిందన్నారు. అలాంటి ఆదికావ్యం రచించిన గొప్ప వ్యక్తి వాల్మీకి జయంతిని జరుపుకోవడం సంతోషదాయకమన్నారు.



వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న కలెక్టర్ రంజిత్ బాషా

కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమ శాఖ ఇన్‌చార్జి అధికారి బి. అర్జునరావు, కలెక్టరేట్ ఏఓ కె.గోపికృష్ణ, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు కృష్ణకాంత్, బీసీ సంక్షేమ శాఖ పర్యవేక్షకులు రమేష్ పాల్గొన్నారు.

పోలీస్ సిబ్బంది సంక్షేమమే ధ్యేయం

జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్

బాపట్లటౌన్: పోలీస్ సిబ్బంది సంక్షేమమే ధ్యేయమని జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్ తెలిపారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాలలో భాగంగా శనివారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. స్థానిక టీటీడీ కల్యాణమండపంలో వైద్యశిబిరంలో రమేష్ హాస్పిటల్ నుంచి 8 మంది స్పెషలిస్ట్ వైద్యసేవలందించారు. ఎస్పీ వకుల్‌జిందాల్ మాట్లాడుతూ పోలీస్ సిబ్బంది వారి కుటుంబ సభ్యులకు ఆరోగ్య సమస్యలు ఉన్న కూడా ఆస్పత్రికి తీసుకువెళ్లి వారికి చికిత్స చేయించే సమయం కొన్ని సందర్భాలలో ఉండకపోవచ్చునన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకొని పోలీస్ అమరవీరుల వారోత్సవాల సందర్భంగా ఈ రోజు జిల్లాలోని పోలీస్ సిబ్బంది, వారి కుటుంబ సభ్యులకు ఉన్న అనారోగ్య సమస్యలు పరీక్షించడానికి మెగా వైద్య శిబిరం ఏర్పాటు చేశామన్నారు. అనంతరం వైద్యశిబిరంలో పాల్గొన్న ప్రతి ఒక్క వైద్యాధికారిని ప్రత్యేకంగా సన్మానించారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ ఎండీహెచ్ ప్రేమ్‌కుమార్, ఎస్‌బీ సీఐ వి.సూర్యనారాయణ, అడ్మిన్ ఆర్ఐ ఎల్.మన్మథరావు, వెల్ఫేర్ ఆర్ఐ బి.శ్రీకాంత్ నాయక్, హోంగార్డ్ ఆర్ఐ ఎల్.గోపీనాథ్, బాపట్ల పట్టణ సీఐ యు.శ్రీనివాసులు పాల్గొన్నారు.



మెడికల్ క్యాంప్ వివరాలు అడిగితెలుసుకుంటున్న జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్

నిమ్మకాయల ధరలు



తెనాలిటౌన్: గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్ యార్డులో శనివారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.3000, గరిష్ట ధర రూ.4800, మోడల్ ధర రూ.4000 వరకు పలికింది.

క్లుప్తంగా

అండర్-17 రాష్ట్ర క్రికెట్ జట్ల ఎంపిక



మార్టూరు: ఉమ్మడి ప్రకాశం జిల్లా పాఠశాలలకు చెందిన అండర్-17 బాలబాలికల రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలకు జట్లను ఎంపిక చేశారు. బాపట్ల జిల్లాలోని మార్టూరు మండలం వలపర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం నిర్వహించారు. ఉమ్మడి జిల్లా నలుమూలల నుంచి పలు పాఠశాలలకు చెందిన క్రీడాకారులు ఎంపికల్లో పాల్గొన్నారు. బాలబాలికల విభాగాల్లో 16 మంది చొప్పున 32 మందిని ఎంపిక చేసినట్లు పాఠశాల పీడీ రవి దేవరాజు తెలిపారు. ఎంపికైన బాలబాలికల జట్లు నవంబర్‌లో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీల్లో పాల్గొననున్నట్లు ఆయన పేర్కొన్నారు.

క్విజ్‌లో జ్యోతిరాసాయి ప్రతిభ



బాపట్ల అర్బన్: టీసీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆన్‌లైన్ క్విజ్ ప్రాంతీయ స్థాయి పోటీలకు జ్యోతిరాసాయి ఎంపికైనట్లు జిల్లా విద్యాశాఖ అధికారి పి.వి.జె.రామారావు శనివారం తెలిపారు. రాష్ట్రంలోని ప్రతి జిల్లా నుండి 23 మంది విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక కాగా రాష్ట్ర స్థాయి పోటీల్లో ఆరుగురు విద్యార్థులను ప్రాంతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. విద్యార్థి నగరం మండలం ఉల్లిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్నట్లు చెప్పారు. విద్యార్థికి గైడ్ టీచరుగా వ్యవహరించిన ఉపాధ్యాయులు పీవీ శ్రీనివాసరావును పాఠశాల ప్రధానోపాధ్యాయిని వై.రాజేశ్వరి, జిల్లా సైన్స్ అధికారి మహమ్మద్ సాదిక్ అభినందించారు.

మూతపడ్డ దేవాలయాలు

తాడేపల్లిరూరల్: చంద్రగ్రహణం శనివారం ప్రారంభం కానుండడంతో తాత్కాలికంగా దేవాలయాల్లో పూజా సేవలు నిలిపివేశారు. ప్రధాన దేవాలయాలైన లక్ష్మీనరసింహస్వామి ఎగువ, దిగువ సన్నిధి, ఉపాలయాలను, పలు శివాలయాలను, తాడేపల్లి కృష్ణాతీరంలోని విజయకీలాద్రి పర్వతంపైన ఉన్న దేవాలయాలను, పలు దేవాలయాలను, దుగ్గిరాల మండల పరిధిలోని కంతంరాజు కొండూరులో వున్న మహంకాళీ అమ్మవారి దేవాలయాన్ని సాయంత్రం 4 గంటల నుంచి మూసివేశారు.

మహర్షి వాల్మీకి నేటితరానికి స్ఫూర్తి

జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి

గుంటూరు వెస్ట్: రామాయణ మహాకావ్య రచయిత, ఆదికవి మహర్షి వాల్మీకి మనదేశ వారసత్వపు మహా పురుషుడని, యువతకు స్ఫూర్తిప్రదాతని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి కొనియాడారు. ఆయన జయంతిని పురస్కరించుకుని శనివారం స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో సమావేశ మందిరంలో కలెక్టర్‌తోపాటు జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి, సోషల్ వెల్ఫేర్ డీడీ మధుసూధనరావు, కుమ్మరి, శాలివాహన కార్పొరేషన్ చైర్మన్ మండేపూడి పురుషోత్తం, ఏపీ కటిక వెల్ఫేర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ కె.శివరాం బాబాజీ, అధికారులు పూలమాలలతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మహర్షి వాల్మీకి రచించిన మొదటి గ్రంథం రామాయణం కుటుంబ వ్యవస్థకు ఆదర్శమన్నారు. ఇది ఇప్పటి వ్యవస్థకు ఎంతో ముఖ్యమని తెలిపారు. డీఆర్‌ఓ చంద్రశేఖరరావు, డిప్యూటీ కలెక్టర్ సుజాత పాల్గొన్నారు.



వాల్మీకి మహర్షి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్ వేణుగోపాల్ రెడ్డి

వేగవంతంగా ప్రభుత్వ భవనాల నిర్మాణాలు..

గుంటూరు వెస్ట్: జిల్లాలో తొలి విడతగా 24 మల్టీ పర్పస్ ఫెసిలిటీ కేంద్రాల నిర్మాణం పూర్తి చేశామని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. శనివారం రాష్ట్ర సచివాలయం నుంచి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కేఎస్ జవహర్ రెడ్డి నిర్వహించిన వీడియో సమావేశానికి స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో సమావేశ మందిరంనుంచి కలెక్టర్‌తోపాటు జేసీ జి.రాజకుమారి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రెండో విడతగా 29 గోడౌన్ల నిర్మాణాలకు అవసరమైన 25 స్థలాలను కూడా గుర్తించామన్నారు. మిగతా నాలుగు గోడౌన్లకు స్థలాలను సేకరించి నిర్మాణాలు ప్రారంభిస్తామన్నారు. దీంతోపాటు ప్రభుత్వ ప్రాధాన్యతా భవనాలైన గ్రామ, వార్డు సచివాలయాలు, విలేజ్ హెల్త్ సెంటర్లు, డిజిటల్ లైబ్రరీల భవనాల నిర్మాణాలు కూడా పూర్తి కావచ్చయన్నారు. పాడిరైతులకు స్వల్ప కాలిక రుణాలు, పాడి గేదెల కొనుగోలుకు దీర్ఘకాలిక రుణాలు మంజూరుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు.

మంత్రి రాంబాబుపై దాడి కులపరంగా జరిగింది

జీడీసీసీబీ చైర్మన్ లాలుపురం రాము

కొరిటెపాడు(గుంటూరు): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబుపై జరిగిన దాడి కులపరంగా జరిగిందని ప్రచారం జరుగుతోందని గుంటూరు జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ చైర్మన్ లాలుపురం రాము పేర్కొన్నారు. గుంటూరులోని ఓ హోటల్‌లో శనివారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాపు నాయకుడు వంగవీటి మోహనరంగాను కూడా ఎంతో ఇబ్బంది పెట్టి శాంతియుతంగా ధర్నా చేస్తుండగా చంపించారని తెలిపారు. చంద్రబాబునాయుడు మోహనరంగాను చంపించాడని గతంలో ఆనాడు కేబినేట్‌లో మంత్రిగా ఉన్న చేగొండి హరిరామజోగయ్య పుస్తకం రిలీజ్ చేశారని గుర్తుచేశారు. ముద్రగడ్డ పద్మనాభంను కూడా దారుణంగా ఇబ్బందులకు గురిచేసి, మానసిక క్షోభకు గురి చేశారని ధ్వజమెత్తారు. అంబటి రాంబాబుపై గతంలో కూడా కోడెల శివప్రసాదరావు దాడి చేయించారని తెలిపారు. ప్రజల సమస్యలపై పోరాడే వ్యక్తి అంబటి రాంబాబు అని కితాబిచ్చారు. కాపు జాతికి అన్యాయం జరిగితే సహించబోమని స్పష్టం చేశారు. భౌతిక దాడులకుదిగితే ఉపేక్షించేదిలేదన్నారు. కాపులు రాజకీయంగా ఎదగకూడదా అని ప్రశ్నించారు. మీ పద్ధతి మార్చుకోకపోతే రోడ్ల పైకి రావాల్సి వస్తోందని హెచ్చరించారు. అలా వస్తే మీరు కానరారరని గుర్తుంచుకోవాలన్నారు. గతంలో కమ్మ సామాజిక వర్గానికి చెందిన సభలో అంబటి రాంబాబును చంపిన వారికి రూ.50 లక్షలు ఇస్తామని ప్రకటించారని గుర్తుచేశారు. అయినా వారిపై ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. కాపు నాయకుడు, గుంటూరు అన్నదాన సమాజం మాజీ చైర్మన్ మిరియాల ప్రసాదరావు మాట్లాడుతూ రాజకీయాలు కులాలకు అతీతంగా జరగాలి తప్ప ఒక కులాన్ని టార్గెట్ చేసి భౌతిక దాడులకు దిగడం సరికాదన్నారు. కాపులు రాజ్యాధికారం కోసం ముందుకు రాకూడదా? అని ప్రశ్నించారు.

ఓటు హక్కుతోనే యువతకు సాధికారత

విశ్రాంత ఐఏఎస్ అధికారి, సామాజిక కార్యకర్త ఎన్.జయప్రకాష్ నారాయణ

ఐనవోలు(తాడికొండ): ఓటు హక్కు ద్వారానే యువతకు సాధికారత సాధ్యమని, దేశ, రాష్ట్ర భవిష్యత్‌ను నిర్ణయించేందుకు ఓటు హక్కు ఉపయోగపడుతుందని మాజీ ఎమ్మెల్యే, విశ్రాంత ఐఏఎస్ అధికారి, సామాజిక కార్యకర్త ఎన్.జయ ప్రకాష్ నారాయణ అన్నారు. శనివారం వీఐటీ ఏపీ విశ్వ విద్యాలయంలో భారతదేశంలో ఎన్నికల సంస్కరణలు- ఓటింగ్ ద్వారా యువతకు సాధికారత అనే అంశంపై నిర్వహించిన అవగాహనా సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఎన్నికల్లో యువత భాగస్వామ్యం అవసరమని, డబ్బుకు మద్యానికి ఓటు హక్కు అమ్ముకోకుండా వినియోగించుకోవాలన్నారు. ఎన్నికల విధానాలపై అవగాహన పెంపొందించుకోవడానికి అవసరమైన పలు అంశాలపై వివరించారు. ఈ కార్యక్రమంలో వీఐటీ ఏపీ విశ్వ విద్యాలయం వైస్ చాన్స్‌లర్ డాక్టర్ ఎస్‌వీ కోటారెడ్డి, రిజిస్ట్రార్ డాక్టర్ జగదీష్ చంద్ర ముదిగంటి, స్కూల్ ఆఫ్ లా డీన్ డాక్టర్ చెక్కా బెనర్జీ, ఫ్యాకల్టీ కో ఆర్డినేటర్ ప్రొఫెసర్ కీర్తిక సాహు, అధ్యాపకులు పాల్గొన్నారు.

పెదపులివర్రులో గ్రహణ కాల పూజలు



పెదపులివర్రు(భట్టిప్రోలు): చంద్ర గ్రహణం సందర్భంగా శనివారం భట్టిప్రోలు మండలం పెదపులివర్రు బాలా త్రిపుర సుందరి సమేత రాజరాజ నరేంద్ర స్వామి(శివాలయం) దేవాలయం తలుపులు తెరిచే ఉంచారు. గ్రహణ కాలంలో(సూర్య,చంద్ర) ఆనవాయితీగా ప్రత్యేక అభిషేకాలు, జపాలు నిర్వహించడం ఇక్కడి స్వామి వారి ప్రత్యేకత. పూజా కార్యక్రమాలను అర్చకులు ఆమంచి సృజన్ కుమార్ శాస్త్ర యుక్తంగా నిర్వహించారు. ఈ ఆలయంపై గ్రహణ ప్రభావం ఉండదని తెలిపారు.

108, 104 డ్రైవర్ల ఉద్యోగాలకు దరఖాస్తులు

చీరాల రూరల్: జిల్లాలోని అరబిందో మెడికల్ సర్వీసెస్ 108, 104, 102 వాహనాల్లో డ్రైవర్ పోస్టుల కోసం అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానించనున్నట్లు 108 జిల్లా మేనేజర్ పి. బాలకృష్ణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు 10వ తరగతి పాసై, వయసు 35 లోపు ఉండాలని పేర్కొన్నారు. అర్హత ఆసక్తి కలిగిన వారు సోమవారం చీరాల ప్రాంతీయ ప్రభుత్వాస్పత్రిలోని 108 కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలన్నారు. పూర్తి వివరాలకు జిల్లా మేనేజర్ 83095 30078, 88851 07040 నంబర్లను సంప్రదించాలని ప్రకటనలో కోరారు.

ఏఎస్‌ఐ దాసు అనుమానాస్పద మృతి

సంగుపాలెం కోడూరు(పిట్టలవానిపాలెం): కొరిశపాడు పోలీస్ స్టేషన్‌లో ఏఎస్‌ఐగా పనిచేస్తున్న దాసు సంగుపాలెం కోడూరులో అనుమానాస్పద స్థితిలో మృతిచెందిన ఘటన శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. చందోలు ఎస్‌ఐ రాజశేఖర్ తెలిపిన వివరాలు.. గతంలో చందోలు పోలీస్ స్టేషన్‌లో ఏఎస్‌ఐగా విధులు నిర్వహించిన దాసు కొన్ని నెలల క్రితం బదిలీపై కొరిశపాడు పోలీస్ స్టేషన్‌కు వెళ్లాడు. ఏఎస్‌ఐ దాసు శుక్రవారం అర్ధరాత్రి పిట్టలవానిపాలెం మండల పరిధిలోని సంగుపాలెం కోడూరుకు చెందిన ఎనికేపల్లి మల్లీశ్వరి ఇంటి ముందు అనుమానాస్పదంగా మృతిచెంది ఉన్నాడని చెప్పారు. దాసు భార్య ఎస్తేరు రాణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ రాజశేఖర్ తెలిపారు. దాసు మృతదేహాన్ని డీఎస్పీ వెంకటేశ్వర్లు, బాపట్ల రూరల్ సీఐ వేణుగోపాల్‌రెడ్డి పరిశీలించారు.



సంగుపాలెం కోడూరులో అనుమానాస్పదంగా మృతి చెందిన ఏఎస్‌ఐ దాసు

నెలల వ్యవధిలోనే వందలాది మందికి ఫోన్లు

106 మందికి రూ.26.50 లక్షలు విలువైన ఫోన్లు అప్పగింత

నగరంపాలెం: కొద్ది నెలల్లోనే వందలాది మంది బాధితులకు పోగొట్టుకున్న మొబైల్‌ఫోన్లను తిరిగి అప్పగించినట్లు జిల్లా ఏఎస్పీ (పరిపాలన), ఐటీ కోర్ నోడల్ అధికారిణి కె.సుప్రజ అన్నారు. ఇటీవల సెల్‌ఫోన్లను పోగొట్టుకుని ఫిర్యాదు చేసిన బాధితుల్లో 106 మందికి సుమారు రూ.26.50 లక్షలు ఖరీదు చేసే వివిధ రకాల బ్రాండెడ్ కంపెనీల సెల్‌ఫోన్లను శనివారం జిల్లా పోలీస్ కార్యాలయ (డీపీఓ) ఆవరణలో ఏఎస్పీ కె.సుప్రజ అందించారు. ఏఎస్పీ మాట్లాడుతూ జిల్లా ఎస్పీ ఆరిఫ్‌హఫీజ్ ఆదేశాల మేరకు సెల్‌ఫోన్లు పోగొట్టుకున్న బాధితుల సౌకర్యార్థం పోలీస్ వాట్సాప్ నంబర్ 8688831574ను కొద్దినెలలు క్రితం అందుబాటులోకి తీసుకొచ్చినట్లు తెలిపారు. వాట్సాప్ నంబర్ ద్వారా ఎటువంటి ఎఫ్ఐఆర్ లేకుండానే, ఇప్పటి వరకు సుమారు రూ.కోటి పైగా ఖరీదు చేసే మొబైల్‌ఫోన్లను బాధితులకు అప్పగించినట్లు చెప్పారు. మొబైల్‌ఫోన్లు పోగొట్టుకున్న వెంటనే సీఈఐఆర్ సిటిజన్ పోర్టల్ ద్వారా ఫిర్యాదు చేయాలన్నారు. పోగొట్టుకున్న ఫోన్‌ను 48 గంటల వ్యవధిలో గుర్తించి, అప్పగించడం ఆనందంగా ఉందని జీజీహెచ్‌లో వైద్యురాలుగా విధులు నిర్వహించే శుశ్మ సంతోషం వ్యక్తం చేశారు.



మొబైల్‌ఫోన్లు తీసుకున్న వారితో ఏఎస్పీ కె.సుప్రజ

అండర్-19 బాల బాలికల హాకీ జట్ల ఎంపిక

సత్తెనపల్లి: విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని చేబ్రోలు ప్రభుత్వ జూనియర్ కళాశాల వ్యాయామ అధ్యాపకుడు వై.పెద్దబ్బాయి అన్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్ -19 బాల, బాలికల హాకీ జిల్లా జట్ల ఎంపికలు పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండలం నందిగామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం నిర్వహించారు. తొలుత హాకీ పోటీలను నిర్వహించి ఎంపికలను ప్రారంభింపజేశారు. ఇక్కడ ఎంపికైన క్రీడాకారులు నవంబర్‌లో జరిగే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రస్థాయి 67వ స్కూల్ గేమ్స్ పోటీల్లో పాల్గొంటారని పెద్దబ్బాయి తెలిపారు.

బాలుర జట్టు : ఎ.బాల యేసు, ఎం.రుషి, ఎం.శివ దుర్గా గణేష్, కె.రాహుల్, సయ్యద్ షాహిద్ అహ్మద్, షేక్.సుభాని, కె.ఉత్తేజ్, ఎం.శరత్ చంద్ర, జె.ప్రవీణ్‌కుమార్, కె.రాకేష్, పి.వెంకటేష్, పి.తేజ్ ప్రణీత్, బి.లక్ష్మీ ప్రకాష్, కె.విజయ చోళుడు, డి.మధుమోహన్, షేక్ నజీర్, బి.వికాస్, ఎస్.దత్త సాయి, స్టాండ్ బై లుగా షేక్. సమీర్, షేక్. సర్దార్, జి. అరుణ్‌లు ఎంపికయ్యారు.

బాలికల జట్టు: బూసిరాజు పావని సాయి, ఎస్. రమ్య, టి.స్రవంతి, సి.హెచ్ లాస్య, పి.శివ బిందు, కె.శివనాగ అంజలి, ఎం.నీలిమ, జె.తనుశ్రీ,, చట్టు జ్ఞాన శ్రీ అర్చన, వి.అఖిల, షేక్ ఆసిఫా, ఎ.హారిక, కె.వెంకట త్రివేణి, టి. జయలక్ష్మి, జి.కీర్తన, కె.మోహనలక్ష్మి, ఎం .వజ్ర వైడూర్య, డి.స్వరూప, స్టాండ్ బైలుగా బి. అఖిల, కె.లక్ష్మీభవానిలు ఎంపికయ్యారు. హెచ్ఎంలు కె.శ్రీనివాసరావు (నందిగామ), తోక సోమనాథ్(గుడిపూడి), కె.వెంకట్రావు (పెద్దమక్కెన), ఫిజికల్ డైరెక్టర్లు గంప శ్రీను, పి.శివరామకృష్ణ, లాకు పిచ్చయ్య, బి.అనిల్‌దత్త నాయక్, సీహెచ్ వి.నాగరాజు, వీర చంద్ర, భాస్కర రావు ఉన్నారు.